# అద్వైత దీప్తి.. ప్రజ్ఞాన కీర్తి!

**విధుశేఖర భారతీ స్వామి ఆశ్రమ స్వీకార దశాబ్ది**




ఆదిశంకరులు భారతావని నాలుగు దిక్కుల్లో స్థాపించిన చతురామ్నాయ పీఠాలు.. భారతీయ ఆధ్యాత్మికతకు శక్తి కేంద్రాలు. జగద్గురు పీఠాలలో అత్యంత విశిష్టతను, ప్రాముఖ్యతను సంతరించుకున్నది దక్షిణామ్నాయ శృంగేరీ శారదాపీఠం. శంకర భగవత్పాదుల నుంచి కొనసాగుతూ వస్తున్న గురు పరంపర సనాతన ధర్మాన్ని అహరహం కాపాడుతున్నది. ఈ పరంపరలో భాగంగా విధుశేఖర భారతీ స్వామి శారదా పీఠం 37 పీఠాధీశ్వరులుగా, ఉత్తరాధికారిగా యోగపట్టం అందుకుని దశాబ్ది కాలం అవుతున్నది. భారతీతీర్థ మహాస్వామి వారి ఆశీస్సులతో విధుశేఖర భారతి స్వామి శృంగేరి వ్యాఖ్యాన సింహాసనాన్ని అధిష్ఠించి పదేండ్లు పూర్తయిన సందర్భంగా ఆ అద్వైత స్ఫూర్తిని స్మరించుకుందాం.



**సనాతన** వైదిక కుటుంబంలో జన్మించిన విధుశేఖర భారతీ స్వామి పూర్వాశ్రమ నామం కుప్పా వేంకటేశ్వర ప్రసాదశర్మ. వీరి పితామహుడు రామగోపాల శర్మ వాజపేయ శ్రౌత యాగం నిర్వహించారు. శారదా పీఠంలో జరిగే అనేక వైదిక క్రతువుల్లో ప్రత్యక్షంగా పాల్గొనేవారు. తండ్రి కుప్పా శివసుబ్రహ్మణ్య అవధాని వైదిక పండితుడు. తాత, తండ్రితో అడపాదడపా శృంగేరికి వెళ్లేవారు ప్రసాదశర్మ. ఈ క్రమంలో భారతీతీర్థ స్వామివారి అనుగ్రహానికి పాత్రులయ్యారు. జగద్గురువుల దగ్గర శాస్త్ర అధ్యయనం చేయాలనే కోరికను వ్యక్తం చేయడం, అందుకు ఆయన సమ్మతించడం శారదాంబ సంకల్పమే! భారతీతీర్థ స్వామి మార్గదర్శకత్వంలో, శృంగేరిలోని వేదపండితుల సారథ్యంలో సంస్కృతంలో ప్రావీణ్యం సంపాదించారు ప్రసాదశర్మ. వేద, వేదాంగాలు చదువుకున్నారు. శాస్త్ర అధ్యయనంపై శిష్యుడికి ఉన్న శ్రద్ధను గమనించిన భారతీతీర్థ మహాస్వామి స్వయంగా తర్క, మీమాంస శాస్త్రాలను బోధించారు. జగద్గురువు ప్రత్యక్ష బోధనలో ఐదున్నరేండ్లు తీవ్ర అధ్యయనం చేసి పండితుడిగా, భక్తుడిగా ఎదిగారు. శృంగేరీ పీఠం గురు పరంపరను కొనసాగించే సకల సామర్థ్యాలనూ ప్రసాద శర్మ సంతరించుకున్నారని భావించిన భారతీ తీర్థ మహాస్వామి.. వారిని 2015లో పీఠానికి ఉత్తరాధికారిగా నియమించడానికి నిర్ణయించారు. అలా మాఘ శుద్ధ విదియ, తదియ తిథుల్లో ఉత్తర పీఠాధిపతి శిష్య స్వీకార మహోత్సవం జరిగింది. తుంగా తీరంలో, అభినవ విద్యాతీర్థ మహాస్వామి అధిష్ఠానంలో శ్రీచరణులు శిష్యుడికి ప్రణవోపదేశం, మహావాక్యోపదేశం చేసి 'శ్రీ విధుశేఖర భారతి' అనే యోగపట్టాను అనుగ్రహించారు. ఆనాటి నుంచి శృంగేరీ ఉత్తరాధికారిగా ప్రస్థానం కొనసాగిస్తున్న విధుశేఖర భారతీస్వామి గురుదేవుల మార్గనిర్దేశంలో సనాతన వైదిక ధర్మ రక్షణే ఆలంబనగా పరిశ్రమిస్తున్నారు. అద్వైత దీప్తిగా, లోతైన అనుగ్రహ భాషణంతో ప్రజ్ఞాన కీర్తిగా శారదాపీఠ ప్రభను పెంపుదల చేస్తున్నారు.

- శ్రీ

# మన పోతన.. కవన చేతన!



**'జోజో కమలదళేక్షణ..,**
**పలు తోయంబుల జగముల..,**
**లోకములు నిదురవోవగ...'**

**సుందర అధ్యాత్మ గంధ బంధురములైన ఈ మూడు కంద పద్య అరవిందాలు తెనిగింతలు- అనువాదాలు కాక పోతన మహాకవి సొంతాలు! వేదమంత్రాలనే గోపికలు, వేదవేద్యుడైన సచ్చిదానంద శ్రీకృష్ణ పరబ్రహ్మను, చిదాకాశమనే నంద గృహంలో, అంతఃకరణ చతుష్టయ (మనో, బుద్ధి, చిత్త, అహంకారాలు) మనే నాలుగు కోళ్లు, సత్త్వరజః తమములనే త్రిగుణాలతోపాటు త్రిగుణాల సమస్థితి- సామ్యావస్థ అనే నాలుగు తాళ్లు (గొలుసులు) కలిగిన 'జ్ఞానం' (తెలివి) అనే డోలిక- ఊయలలో పరుండబెట్టి- 'జో అచ్యుతానంద! జోజో ముకుందా! లాలి పరమానంద! కృష్ణ! గోవిందా! జోజో..' అని జోలపాటలు ఆలపిస్తూ ఊపారు. గోవిందునికి ముఖ స్వరూపమైన దశమ స్కంధంలో మునుముందు అందమైన ఇలాంటి కంద పద్యాలెన్నో చెన్నొందు (వెలుగొందు)తాయి!**

**యోగిరాజు శుకుడు రాజయోగి పరీక్షిత్తుతో...**

సీ|| 'ఏ బాము లెరుఁగక యేపారు మేటికిఁ,
పసుల కాపరి ఇంట బాము గలిగె
నే కర్మములు లేక యెనయు నెక్కటికిని
జాతకర్మంబులు సంభవించె,
నే తల్లి చనుఁబాలు నెరుగని ప్రోడ
యశోద చన్నుల పాల చొరవ నెరిఁగె
నే హాని వృద్ధులు నెరుగని బ్రహ్మంబు
పొదిగిటిలో వృద్ధిఁబొందఁ జొచ్చె'
ఆ|| 'నే తపములనైన నెలమి బండని పంట
వల్లవీ జనముల వాడఁబండె
నే చదువులనైన నిట్టిట్టి దనరాని
యర్థ మవయవముల నందమొందె'

రాజా! ఎప్పటికీ ఎట్టి పుట్టుకలూ లేకుండా ఏపారు (అతిశయించు, విజృంభించు) మేటికి- దిట్టకు పసుల కాపరి (నందుని) ఇంట పట్టి (కొడుకు)గా పుట్టడమనే ఇక్కట్టు (కష్టం) కలిగింది. వైదిక, లౌకిక- వ్యావహారికాలైన అన్ని కర్మలకు అతీతుడై, తానొక్కడే వెలుగు జలజాతనేత్రుడు- పద్మాక్షుడు వెన్నుడు- విష్ణువు జాతకర్మలు జరిపించుకొన్నాడు. జగత్తుకు తల్లి, తండ్రి, తాత, ముత్తాత అన్నీ తానే కాన ఏ తల్లిపాలు ఎరుగని ఆ గడుసరి సతీమతల్లి యశోదమ్మ చనుబాల రుచి మరిగి కొసరి కొసరి అడిగి మరీ తాగుతున్నాడు. హాని వృద్ధులు (పెరుగుట, తరుగుట) లేని పరబ్రహ్మం ఈనాడు పూనికతో మానిని యశోద ఒడిలో వడివడిగా ఎదగసాగాడు. ఎన్ని తపస్సులు చేసినా పండని, సింగారాలతో రంగారు (అలరు) బంగారుపంట నేడు మంద (గోకులం)లో నందుని ఇంట కన్నుల కరువు తీర పండింది. వేదశాస్త్రాది ఎంతలేసి విద్యలు నేర్చినా ఇదమిత్థమని- ఇట్టిట్టిదని సుంతైనా తెలియరాని- అంతుపట్టని ఆ పరమార్థం అవయవాల పొందికతో అందమైన శిశురూపం ధరించి మందలోని భాగ్యవంతులందరిచే ఆనందంగా పొందబడుతోంది!

నందుడు మథురకు వెళ్లి కంసరాజుకు ఏటేటా కట్టవలసిన కప్పం చెల్లించి, మర్యాదపూర్వకంగా వసుదేవుని దర్శించాడు. నంద దర్శనంతో వసుదేవుని హృదయారవిందం వికసించింది. ప్రాణాలు లేచి వచ్చాయి. తన నందనుని (పసివాని)పై అమంద- ఎనలేని ప్రేమ ఉప్పొంగగా నందునితో... 'సంగడీ (మిత్రమా)! సంతతి లేదని తీరని చింతతో చితికిపోయిన నీకు ఈనాటికి సంతతి కలిగినందుకు మాకు ఎంతో సంతసమయింది. 'సంతతి హీనునికి సౌఖ్యసంతతి గలదే?'- నిజానికి సంతతి లేనివానికి సౌఖ్య సంతతి- సుఖ పరంపరలు ఉండవు కదా! నందా! మీ దంపతులు ఎంతో ప్రేమగా సాకుతుండగా, నిన్ను తండ్రిగా భావించు నా కుమారుడు ఆనందంగా ఉన్నాడా?'- 'నా కొడుకున్నాడె నంద నందాన్వితుడై' అని అడిగాడు. 'మీ వద్ద తనయుడై తనరారు (పెరుగుచున్న) బాలుడు- మారజనకుడు విష్ణువు నా కుమారుడే!' అని చక్కని ధ్వని! ఇది మన పోతన కవన (కవితా) నిర్మాణ చేతనా చాతురి- నేర్పు! ఈ ప్రశ్న బలరాముని గురించి కదా అని నందుడు భావించాడు. కృష్ణుడు దేవకీ నందనుడని తెలియనందున నందుడు.. 'వసుదేవా! నీ కుమారులందరినీ కంసుడు పుట్టిన వెంటనే తుదముట్టించాడు గదా! 'నా సూనుండు నీ సూనుడే'- నా కొడుకునే నీ కొడుకనుకొని ఊరడిల్లు' అని సానుభూతి కనబరిచాడు. వసుదేవుడు.. 'నందా! సానందమైన- ఆనందమయంగా ఉన్న మందలో నందనునికి- బాలగోవిందునికి, ఆపద సంభవించే సూచనలు నా స్వాంతంలో (మనసులో) పొడసూపుతున్నాయి. ముందు జాగ్రత్తగా నువ్వు వెంటనే నెలవుకు- నివాస స్థానానికి బయల్దేరు అంటూ సెలవు ఇచ్చి పంపించాడు. వసుదేవుని మాట వర్తమాన కాల వాచకం. అనగా మథురలో ఈ వార్తాలాపం- సంభాషణ జరుగుతుండగానే కంసుని పంపున బాలఘాతిని- పసిపిల్లల పచ్చి నెత్తురును కచ్చెతో తాగే పూతన గోకులానికి వచ్చింది. మంచి మనసున్న వసుదేవునికి భవిష్యత్తు వర్తమానంగా గోచరించింది. వసుదేవుని వంటి సత్యనిష్ఠునికి సుష్ఠుగా వాక్సిద్ధి కలుగుతుందని సూచన!



మన పోతన 160 మధురిమ వ భాగం

మాయావిని పూతన ఆకాశమార్గంలో గోకులానికి వచ్చి, నందుని ఇంట్లో బాలుని నాదం- కేరింతలు, రోదనం విన్నది. ప్రమోద భరితయై కామరూపిణి కాన, ఆ లేమ చాలా అందమైన భామ రూపం పొంది లీలా బాలుని మందిరంలోకి ప్రవేశించింది. ఆ సుందరి లోపలికి వస్తుంటే 'మనలను అందరినీ బతికించడానికి ఇంత అందమైన వేషంతో సాక్షాత్ ఇందిరా దేవే మన మందిరానికి వచ్చినట్టుంది!' అని మోహంలోపడి మాటలుడిగి మైకం కమ్మి నిలబడి పోయారు గోపికలు. మాయా శిశురూపంలో మంచం మీద పరుండిన విరించి (బ్రహ్మ) జనకుని, సర్వజీవ చేతనా స్వరూపుని, పరాత్పరుని చూచింది పూతన. ఆ నిప్పు నివురుగప్పి ఉండటం వలన తాకితే ముప్పు తప్పదని, ఆ డింభకుడు (శిశువు) దుష్టజన సంహార ప్రారంభకుడని ఆమె గ్రహించలేకపోయింది. బాలెంతరాలి వేషంలో పాలిండ్లలో విషం ధరించి వస్తున్న ఆ బాల హంతకురాలిని లీలాగోపాల బాలుడు చూచి లోలోపల నవ్వుకొని నిద్రిస్తున్నట్లు కళ్లు మూసుకొని గుర్రుపెట్టసాగాడు. రోహిణి యశోదాది వారిజాక్షులు ఎంత అవ్వారి (గట్టి)గా వారిస్తున్నా ఆ వాలుగంటి (విశాలాక్షి) పూతన వారి మాటలు పట్టించుకోలేదు. ఆ పిల్లవానిని తన చేతులతో లేవనెత్తి పాలిండ్లకు హత్తుకుంది. నిద్రిస్తున్న పామును తాడుగా భ్రమించి చేతితో ఆడుకొన చూసే పాడు బుద్ధి వాని (మూర్ఖుని)వలె బాలుని తొడలపై పెట్టుకొని, ఒడలు (ఒళ్లు) నిమురుతూ, వాత్సల్యం నటిస్తూ 'పాలు తాగు నాన్నా!' అంటూ చిన్ని కన్నయ్యగా ఉన్న వెన్నునికి- విష్ణువుకి చన్నిచ్చింది...

కం|| 'నా చనుబాలొక గ్రుక్కెఁడు
నోచిన్ని కుమార! త్రావు మొయ్యన పిదపన్
నీ చెలువ మెరుఁగ వచ్చును
నా చెలువము సఫలమగును నళినదళాక్షా!'

'కమలాల వంటి కన్నులు గల చిన్నికన్నా! నా చన్నుపాలు తిన్నగా ఒక్క గుక్కెడు తాగిచూడు. అప్పుడు నీ అందమెలా ఉంటుందో తెలుస్తుంది. ఇప్పటి నా అందం కూడా అందలమెక్కుతుంది' అని అన్నది. 'నా క్షీరం తాగి నువ్వు క్షేమంగా ఉంటావు. నా జన్మ కూడా సార్థకమవుతుంది' అని గూఢార్థం!

శుకుడు- రాజా! కృష్ణుడు మెల్లగా కళ్లు తెరచి, ఒళ్లు విరిచి, ఆవులించి ఎంతో ఆకలిగా ఉన్నట్టు చన్నులను గట్టిగా పట్టి నోట పెట్టుకున్నాడు. గుటుకు గుటుకు మంటూ రెండు గ్రుక్కల్లో దాని మేని సత్తువంతా లాగేసి ఇందిరాజాని-విష్ణువు, కాలకూటకు పాలతోపాటు లోని ప్రాణాలు కూడా తాగేశాడు. గుండెలు తల్లడిల్లగా పూతన నిలువలేక తల వాల్చేసింది. 'అమ్మో! నీవు ఇతర బాలురవంటి వాడవు కావు. బిడ్డా! చాలు చాలు. ఇక పాలు తొగొద్దు' అంటూ కాలు చేతులు వంకరలు తిరగగా, కళ్ల గ్రుడ్లు వెల్లుకు రాగా గోల చేస్తూ పర్వతాకారం- భయంకర రూపంతో నేల కూలి ప్రాణాలు కోల్పోయింది. 'నీవు గోపాలుడవు కదా! నీ వద్ద పాలు పెరుగులకు ఏ లోపాలూ ఉండవని నిన్ను ఆశ్రయిస్తే, నా పాలి దైవమా! హే కృపావిశాలా! నా పాపాలను హరించుటే కాక, పనిలోపనిగా నాకిక తల్లిపాలు తాగేపని (జన్మ) కూడా లేకుండా చేశావు కదా హరీ!' అని అని వివరించారు లీలాశుక ముని!

(సశేషం)




తంగిరాల రాజేంద్రప్రసాద శర్మ
98668 36006


# ధర్మానికి ప్రతీక భీష్ముడు

**ఈ నెల 16న భీష్మాష్టమి**




**భీష్ముడు** అనగానే ధైర్యసాహసాలకు మారుపేరైన రూపం మెదులుతుంది. తండ్రి కోసం, కొడుకుల కోసం, ధర్మ స్థాపన కోసం జీవితాన్ని ధారపోసిన త్యాగ నిరతుడు భీష్ముడు. ఇచ్ఛామరణ వరం ఉన్న భీష్ముడు ఉత్తరాయణం వచ్చాక ప్రాణాలు విడిచిపెట్టాడు. ఆయన కన్నుమూసిన మాఘ శుద్ధ అష్టమిని భీష్మాష్టమి పర్వంగా పేర్కొన్నారు. దేవతా గణాల్లో అష్టవసువుల పేరు ప్రముఖంగా వినిపిస్తుంది. వీరిలో ఎనిమదో వసువు పేరు ప్రభాసుడు. ఈ ప్రభాసుడే భీష్ముడిగా జన్మించాడు. గంగాదేవి, శంతన మహారాజు ఎనిమిదో సంతానంగా పుట్టిన ప్రభాసుడికి దేవవ్రతుడు అని పేరు పెట్టారు. పదహారేండ్లపాటు గంగాదేవి దగ్గర పెరిగాడు. సకల విద్యలు అభ్యసించిన దేవవ్రతుడిని శంతనుడికి అప్పగించింది. తండ్రిమీద అభిమానంతో తనకు రావలసిన రాజ్యాధికారాన్ని తృణప్రాయంగా వదిలేశాడు. ఆజన్మ బ్రహ్మచారిగా ఉంటానని భీషణమైన ప్రతిజ్ఞ చేశాడు. కురుక్షేత్ర సంగ్రామంలో పదిరోజులు భీకర యుద్ధం చేసి శిఖండి కారణంగా అస్త్ర సన్యాసం చేసి, అర్జునుడి శరపరంపరకు నేలకొరిగాడు. ఉత్తరాయణ పుణ్యకాలం కోసం యాభై ఎనిమిది రోజుల పాటు అంపశయ్య మీద వేచి ఉన్నాడు. ఉత్తరాయణ పుణ్యకాలం వచ్చాక దేహత్యాగం చేశాడు. ధర్మ పక్షపాతిగా ముద్రపడిన భీష్ముడు పాండవులకు బోధించిన సూత్రాలు.. సర్వకాలాలకూ ఆచరణ యోగ్యాలు.

ధర్మరాజుకు విష్ణు సహస్ర నామాలు ఉపదేశించిన ఈ పురాణ పురుషుడి అనుగ్రహం కోసం భీష్మాష్టమి సందర్భంగా ఉపవాసం, జాగారం చేసే ఆచారం ఉంది. విష్ణుమూర్తిని తామర పూలు, తులసి దళాలు, జాజిమాలతో అలంకరించాలి. విష్ణు అష్టోత్తరం, నారాయణ కవచం, నారాయణ హృదయం, విష్ణు సహస్రనామాలు, విష్ణు పురాణం వంటి విష్ణు సంబంధిత పారాయణాలు చేయాలి.

... శ్యామ్‌ప్రసాద్

**ఇస్లాం బోధ**

# కూతురు అన్నిటా సమానం



**ఒకానొక** ప్రాంతంలో ఓ పెద్దాయన అనారోగ్యంతో కన్నుమూశాడు. అతని అంత్యక్రియల ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. ఊరి జనమంతా మృతుడి ఇంటికి చేరుకున్నారు. అంతిమ యాత్ర మొదలయ్యే సమయంలో ఒక వ్యక్తి హుటాహుటిన అక్కడికి వచ్చి 'ఈ పోయిన మనిషి నాకు ఇంత మొత్తం రుణపడి ఉన్నాడు. ఆ అప్పు తీరిస్తే గానీ.. అంత్యక్రియలు జరగనివ్వను' అని భీష్మించాడు. మృతుడి కొడుకులు ఎవరూ ఆ అప్పు తీర్చడానికి ముందుకురాలేదు. 'నీ దగ్గర అప్పు తీసుకున్నట్టు మా నాన్న ఎన్నడూ చెప్పలేదన్నా'రు. వాదోపవాదాలు కొనసాగుతుండగా ఒక మహిళ ముందుకొచ్చింది. తన ఒంటిపై ఉన్న నగలన్నీ ఆ వ్యక్తికి ఇచ్చేసింది. 'వీటన్నిటినీ తీసుకోండి.. మా నాన్నగారి అంత్యక్రియలకు అడ్డు తగలకండి' అన్నది. అప్పుడా మనిషి 'చనిపోయిన వ్యక్తికి నేనే అప్పు పడ్డాను. అతని నిజమైన వారసులు ఎవరో తెలుసుకోవడానికే ఇలా నటించాను. మీ నాన్నకు నిజమైన వారసురాలివి నీవేనమ్మ' అని నగలతోపాటు డబ్బులు కూడా ఆమెకు ఇచ్చాడు. ఆడపిల్లల పట్ల వివక్ష చూపేవారికి ఈ సంఘటన కనువిప్పు. ఆడబిడ్డలను వివక్షతో పెంచకూడదని ముహమ్మద్ ప్రవక్త ఎప్పుడూ చెబుతుండేవారు. ఆడపిల్లలు నరకాగ్నికి అడ్డుగోడలని, తండ్రికి స్వర్గాన్ని సుగమం చేస్తారని పేర్కొన్నారు. ఆడబిడ్డను పెంచి పోషించిన తండ్రి స్వర్గార్హత సాధిస్తాడని తలిపారు. ప్రవక్త (స) తన నలుగురు కుమార్తెలను ఎంతో ప్రేమాదరణలతో పెంచి పెద్దచేశారు. బయటినుంచి ఇంటికి రాగానే తమ కూతుళ్ల చేతులను ముద్దాడేవారు. మగపిల్లలతో సమానంగా ఆడపిల్లలనూ పెంచాలని ఆయన సూచించారు. ఏదైనా వస్తువు ఇంటికి తీసుకువస్తే ముందుగా కూతురుకే ఇవ్వాలని చెప్పారు. కూతుళ్లకు ఆస్తిలో హక్కు కల్పించాలని ఖురాన్ పేర్కొనడం విశేషం.


ముహమ్మద్ ముజాహిద్,
96406 22076




# మేలుకో.. మమ్మేలుకో!

**ఈ నెల 16న రథ సప్తమి**

సప్తాశ్వ రథ మారూఢమ్,
ప్రచండం కశ్యపాత్మజమ్।
శ్వేతపద్మ ధరం దేవం,
తం సూర్యం ప్రణమామ్యహమ్||

'ఏడు గుర్రాలను అధిరోహించిన వాడు, అదితి-కశ్యపుల పుత్రుడు, తెల్లని పద్మాన్ని చేతిలో ధరించిన వాడు అయిన సూర్యభగవానుడికి మనసారా నమస్కారం చేస్తున్నాను' అని పై శ్లోకానికి అర్థం. ప్రత్యక్ష నారాయణుడైన సూర్యుడు జన్మించిన మాఘ శుద్ధ సప్తమిని రథ సప్తమిగా చేసుకోవడం సంప్రదాయం. సకల ప్రాణులకూ ఆరోగ్యాన్నిచ్చే దైవం ఆదిత్యుడు. మయూరుడనే సంస్కృత కవి కుష్ఠురోగ పీడితుడై సూర్యుడిని ఆరాధించి, సూర్య శతకాన్ని రచించి సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందాడని కథనం. రామ, రావణ యుద్ధ సమయంలో అగస్త్యుడు రఘురాముడికి ఆదిత్య హృదయం ఉపదేశించాడు. ఆదిత్యుణ్ని ఆరాధించిన తర్వాత శ్రీరాముడు సర్వ శక్తి సమన్వితుడై రావణాసురుణ్ని సంహరించాడు. ఆరోగ్యవృద్ధికి, ఐశ్వర్య ప్రాప్తికి ఆదిత్య హృదయ స్తోత్రం పఠించాలని పెద్దలు సూచించారు. సూర్యోపాసనతో సత్రాజిత్తు రోజుకు ఏడు బారువుల బంగారాన్నిచ్చే శమంతకమణి పొందాడని పురాణ కథనం.

సూర్యుడు ఆవిర్భవించిన రథ సప్తమి విశేషమైన పండుగ. ఆనాడు త్రిమూర్తి స్వరూపుడైన సూర్యభగవానుడిని ఆరాధించడం వల్ల విశేషమైన ఫలితం కలుగుతుందని నమ్మకం. సూర్యోపాసన చేయదలచిన వాళ్లు.. షష్ఠి నాడు ఒకేపూట భోజనం చేయాలి. సప్తమి నాడు అరుణోదయానే ఏడు జిల్లేడు ఆకులు, ఏడు రాగి ఆకులను తల, హృదయం, భుజాలు, మెడ మీద ఉంచుకొని స్నానం చేస్తే మంచిదని పెద్దలు సూచించారు. సూర్యకిరణాల్లోని నిరోధకతను జిల్లేడు ఆకులు ఆకర్షిస్తాయి. ఆ శక్తిని శిరస్సులోని బ్రహ్మ రంధ్రం ద్వారా శరీరంలోకి ప్రసరింపజేసి నాడులను చైతన్యవంతం చేస్తాయని నమ్మకం. సూర్యారాధనలో భాగంగా చిక్కుడు కాయలతో రథం చేసి, అందులో సూర్యుణ్ని ఆవాహనం చేసి షోడశ ఉపచారాలలో పూజించాలి. పాయసం, పొంగలి చేసి నివేదనగా సమర్పించాలి. పాయసాన్ని చిక్కుడు ఆకుల్లో ఉంచి నివేదించడం ఆచారం. ఈ ప్రసాదాన్ని స్వీకరించడం వల్ల ఆ పత్రంలోని ఔషధ గుణాలు మనకు మేలు చేస్తాయని పెద్దలు ఈ సూచన చేశారు. రథ సప్తమి సందర్భంగా.. సూర్యుడితోపాటు సౌరమండలం అంతర్గతంగా ఉన్న దేవతలకు, పితృదేవతలకు అర్ఘ్య ప్రదానం చేయడం వల్ల వారి అనుగ్రహం పొందే అవకాశం ఉంటుంది.

.. డా|| వెలుదండ సత్యనారాయణ